

# నూనెసుక్క

కొట్టం రామకృష్ణారెడ్డి

నేను...

సిన్నగ ముసురు మొదలైంది. సిమ్మచీకటి. యాలెంతయ్యిందో తెలుస్తలేదు. ముందుగాల మెరుపు మెరిసింది, జరయినంక యాడ్నో పిడుగు పడ్డట్టుంది, ఉరుమురిమింది. నాకు బుగులయ్యింది.

ఆకిట్ల రెండెడ్ల బండి మీద అమ్మతాన కూకున్నోడ్ని ఇంక జరంత దగ్గెర్కి జరిగిన. ముసురుకి నా నెత్తి తడవకుండ తన కొంగు గప్పి నన్ను దగ్గెర్కి పొదువుకుంది అమ్మ.

బండి ముందల ఎడ్లు కదలకుండ కావలి రాములు నిలవడ్డడు. బండి ఎనకాతల బాపు.

బాపమ్మ పడమటింటి తలుపుకాడ చేరగిలవడ్డది. ఆకిట్ల గన్మకాడ తాత నిలవడి బాపొంక, బండొంక చూడవట్టిండు. ముసురు పెద్దగయింది, గన్మ కాడ నిలవడ్డ తాత, బంకుల్ల ఉన్న పీటె మీద పరిసిన గొంగడి తీసి బాపును బిల్సి ఇచ్చిండు.

కొత్త గొంగడి. అమ్మకు నాకు గప్పి కావలి రాములు దిక్కు జూసిండు. పగ్గాలు ఒదులు జేశి ఎడ్లని అల్లించిండు రాములు.

చిన్నగ పోవట్టింది బండి.

బండి ముందల కావల్రాములు, ఎన్క బాపు నడుస్తున్నరు.

మూలమల్లెతాన ఇంటి దిక్కు సూసిన, గన్మకాడ తాత నిలవడే ఉన్నడు బండి దిక్కు సూస్కుంట.

తాతని సూసి నాకెందుకో గుబులయ్యింది. అమ్మ దిక్కు, బాపు దిక్కు సూసిన. ఆళ్ల సూపు యాడుందో నాకు సమజ్గాలె.

ఊరు దాటి చెరువుకట్ట మీద్కెల్లి పోవట్టింది బండి. వాన ఇంక జరంత ఊటగయ్యింది .

“నువ్వు బండి మీదికెక్కు పటేలా!” అన్నడు కావల్రాములు బాపుతోటి.

బాపు సప్పుడు జెయ్యలె. బండి ఈరనుమాన్ల గుడికాడికి ఒచ్చిందో లేదో, ఆన ఇంక జర ఊటగయ్యింది. దొడ్డు దొడ్డు సిన్కులు పడవట్టినయి. బండి చిన్నగ పోవట్టింది.

అంతల ఎన్క దిక్కుకెల్లి ఎవరో కూతబెట్టినట్టు ఇనొచ్చింది. బండి గుడి ముంగలున్న మర్రిచెట్టు కింద ఆపిండు రాములు. బాపు ఊరుదిక్కు సూడవట్టిండు.

జరసేపయినంక నెత్తికి గోనెసం కొప్పెర వెట్కోని కొత్తప్యాట ఎంకయ్య ఉరుక్కుంట ఒచ్చి నిలవడి దమ్ము తీయవట్టిండు.

“ఏమాయె?” అన్నట్టు సూసిండు బాపు, ఎంకయ్య దిక్కు.

“పటేలు పిలుస్తుండు. ఎన్కసారికి ఆనెల్సినంక, ఇంత ముద్ద తిని పొమ్మంటున్నడు పటేలా!” అన్నడు ఎంకయ్య బాపుతోటి.

బాపు సప్పుడు జెయ్యలె, కీసల సెయ్యివెట్టి ఓ నోటు దీసి ఎంకయ్యకిచ్చిండు.

“పోయ్యొస్త,” అని ముందట్కి నడిసిండు బాపు. ఎంకయ్య బొమ్మలెక్క నిలవడ్డడు, పోతున్న బండి దిక్కు సూస్కుంట.

బండి మన్నాన్‌పల్లె దాటి చౌరస్త దిక్కు నడవబట్టింది.

ఆన ఇడ్వకుండ ఒక్క తీర్గ పడవట్టింది. ఎడ్లబండి చౌరస్తకు సేరుకునే ట్యాలకు తూర్పుదిక్కు ఎర్రగయింది. ఆన ఇడిసి పెట్టింది.

బండ్లకెళ్లి సామాను దింపి పక్కకు బెట్టి రాముల్ని పొమ్మన్నడు బాపు.

బాట పక్కకు నిలవడ్డం నేను, అమ్మ. కావల్రా ములు బండి దీస్కొని ఊరు మొఖాన నడిసిండు.

జరంతసేపట్కి పట్నం బోయె సర్వీసు దూరం కెళ్లి మా దిక్కు రావట్టింది.

*

పట్నంల టికాన బెట్టి ఏండ్లయ్యింది. నా ఇస్కూలు, కాలేజీ అయిపోయింది. కట్టుబట్టలతోని ఊరిడిసినంక ఇన్నేండ్లకు గీడ్నె జరంత జాగ తీస్కొని ఇల్లు గట్టిండు బాపు. మల్ల ఊరు మొఖాన బోలె.

ఎన్నడన్న తాతనే వస్తుండె, సూసిపోనీకె. నేను జరంత పెద్దగయినంక ఎన్నడన్న ఎండకాలం తాతిలల్ల ఊర్కి పొయ్యొస్తుంటి. కాని, ఎప్పుడూ గా దినం వానల ఊరి డిసి ఎడ్లబండి మీద పట్నమొచ్చిన సంగతి నా మతిలకెళ్లిపోలె. మల్ల, మల్ల యాది కొస్తుండె.

గట్లనే ఓ దినం మా యమ్మ నడిగిన గాయల్ల ఎందుకట్లొచ్చినమని. మల్ల బాపు ఊరికి ఎందుకు పోతలేడని.

పోరగాడు పెద్దగయిండు, ఎప్పటికన్న గీ ముచ్చట సెప్పక దప్పదని, గుడ్లల్ల నీళ్లు దీస్కొని చెప్పింది అమ్మ.

**అమ్మ...**

మీ బాపుకు సదువయినంక సర్కారు కొలువొచ్చిందంట. కొలువొచ్చిన జర కన్ని దినాలకే నా పెండ్లయ్యింది. ఈరపట్నంల కాపురం బెట్నం. బ్లాకాఫీసుల క్వాటర్ల ఉండేటోళ్లం. ఇంటెన్క జరంత జాగుంటే మీ బాపు బెండశెట్లేశిండు, మిరపశెట్లే శిండు, పుంటికూర శెట్లేశిండు, చిక్కుడు తీగ పందిరి మీదికి ఎక్కించిండు. దొడ్డు మల్లె కొమ్మ నాటిండు. డ్యూటి కెల్లి రాంగనే దినాం గిదే పని.

అంతట్ల నువ్వు పుట్టినవు. కొన్ని దినాలు బాగనే ఉన్నడు కొలువుల, గాని మీ బాపు మనసుల యెప్పుడు ఊరు మెదులుతుండె. ఊరికెప్పుడు బొవాలె, యవుసం జెయ్యాలే, నలుగురికి ఆసర కావలె అని. ఎప్పుడూ గిదే యావ.

వానగొట్టంగనే, సెల్క దున్నింండ్రో లేదోనని, ఇత్తనాలేసింండ్రో లేదోనని ఊకె ఫికరు జేస్తుండె. ఇగ ఈడ కాలు నిల్వక, కొలువు ఇడిసిబెట్టి, నిన్ను, నన్ను తొల్కొని ఊరికి బోయిండు బాపు.

మీ తాత, బాపమ్మ ఒక్క తీర్గ జెప్పింండ్రు. 'ఒద్దు బిడ్డా, కొలువు జేస్కొని సల్లగుండక గిదేం తిప్పల్రా!' అని. కాని, మీ బాపు యెవ్వల్కి ఇన్లే. రెండేండ్లు బానె యవుసం జేషి పుట్లకు పుట్లు ఒడ్లు పండించిండు.

కాని మీ బాపమ్మ ఎన్నడు ప్రేమ జేయలె మీ బాపుని. దినాం గుల్లుడు, ఒక్క తీర్గ కొత్త కోడల్ని తిప్పల పెట్టినట్టు, తిప్పలు బెట్టింది. గివన్ని మనసు మీదికి తీసుకోక, తన దిల్లు దిమాకు బూమ్మీద పెట్టి మంచి పంట పండించిండు.

ఒక పాలి ఓ తాప ఆనలు కుర్వక కరువొచ్చి ఊరంత ఆగమాగమయ్యింండ్రు. మల్ల యేడు ఆనలు బానే మొదలైనయి.

గాయల్ల మీ బాపు బాయికాడికి బోయిండు. పొద్దుమూకే యాళ్లయ్యింది. పొయ్యి రాజేసి రొట్టెలన్నా చేద్దామని సూస్తె, పొయ్యిల నింగలం ఆరిపొయ్యింది. గింత పిడక నుగ్గు తీస్కొని లంకాలోళ్ల సుగుణక్క తాన్కి పొయ్యి ఇంత నింగలం పిడక మీద యేపిచ్చుకొని ఒస్తుంటె, గాడ కుమ్మరోళ్ల ఇంటికాడికెల్లి మీ బాపు గడ్డి మోపెత్తుకోని, ఆవుని గొట్టుకొని ఒచ్చుడు గనవడ్డది.

నేను దబ్బ, దబ్బ ఇంట్ల కొచ్చి పొయ్యి రాజేసి, రొట్టెలు గొట్టుడు మొదల్వెట్టిన.

అంతట్ల మీ బాపు ఆవుని సాయమాన్ల గట్టేసి, ఇంత పచ్చగడ్డేసి సర్వల పాలు పిండుకొచ్చి, మీ బాపమ్మ కిచ్చి, జారట్లకొయ్యి పెయ్యి కడుక్కొచ్చి వండెమింట్ల పీటేసు కొని కూసున్నడు.

నేనేమో పొయ్యిముందల కూసోని రొట్టెలు కొట్టి కాలిన రొట్టెలు గుల్లల ఏస్తున్న. మీ బాపు పీటె మీద కూసోని, "అమ్మా! రొట్టెయ్యే," అన్నడు. మీ బాపమ్మ ఓ తళ్లె ముందల వెట్టి రెండు రొట్టెలేసి ఇంత చింతకాయ తొక్కు రొట్టె మీద యేసింది.

మీ బాపు తళ్లె ముందల్కి జర్పుకొని, "అమ్మా! తొక్కుల ఇంత నూనె సుక్కెయ్యే, కమ్మగుంటది," అనంగనే, ఆయింత అర్రలకు బోతున్న మీ బాపమ్మ, "కమ్మగ గూసోని తినేటందుకు, నీ తాత గిట్ల సంపాయించి పెట్టిపోయిండా," అన్నది.

గంతే, మీ బాపు ఒక్కపాలి ఇంతెత్తు లేసి తళ్లెను నేలకేసి కొట్టి, గొంగడి బుజా నేస్కొని బాయికాడికి బోయిండు.

బాయికాడికి బోయినాయిన, తిండి దినకుంట రెండు దినాలు నాగలి కొట్టుకుంట, తుకం బోసుకుంట, ఆడ్నే ఉన్నడు.

మూడోనాడు నిన్ను, నన్నుతోల్కొని పట్నమొచ్చిండు. గాయల్ల సంది గియ్యాలటిదాంక ఊరు దిక్కు మల్ల మళ్లి సూడ్లే మీ బాపు.

**నేను...**

నా గుండె బరువయింది. కండ్లల్ల నీళ్లు తిర్గినయ్యి. బాపు మీద ప్రేమ ఇంక జరంత ఎక్వయింది.

బాపమ్మ మీద గొంతుల్దాంక కోపమొచ్చింది. "బాపమ్మ గట్లెందుకన్నదే! బాపు కన్నకొడుకు గాదే?" అమ్మ నడిగిన.

"ఏమో! ఏం బుట్టిందో, పాపిష్టిదానికి," నిష్టూరమయ్యింది అమ్మ.

అప్పటిసంది ఊరికి పోవాలె బాపమ్మను నిగ్గదీయా లని నేను సొంచాయించుకున్న.

*

ఊర్లకి అడుగుపెట్టేట్యాలకు పొద్దుమూకింది, దూళ్లు ఇంటి మొఖం పట్టినయి.

ఆకిట్ల కడుగు బెట్టేట్యాలకు తాత అరుగు మీద గూసోని, కందీలుకున్న మసిని బట్టతోటి తుడుస్తున్నడు. నన్ను సూడంగనే మస్తు కుషయిండు, దగ్గర్కి దీస్కుని పెయ్యంత నిమిరిండు.

ఇంట్లదిక్కు సూస్కుంట, "ఇగో! నీ మనుమడొచ్చిండే," అన్నడు.

రప్పనొచ్చింది బయటికి బాపమ్మ. నన్ను జూసి కండ్లళ్ల నీళ్లు దీస్కుంది. "మా నాయనే," అని దగ్గర్కి తీస్కుని నెత్తి నిమిరింది. కాని, నా మనసుల ముల్లు గుచ్చుకుంటనే ఉన్నది.

జారట్ల కాళ్లు కడుక్కొచ్చినంక వండెమింట్ల పీటేసి కూకోబెట్టి తళ్లెల రెండు రొట్టెలేసి, దానిమీద ఇంత చింతకాయ తొక్కేసింది బాపమ్మ. తాత కందీలు ముట్టించి, సిలక్కొయ్యకు తగిలిచ్చొచ్చి గన్మకాడ కూసున్నడు.

"బాపమ్మా! తొక్కులకు ముత్తెమంత నూనె సుక్కెయ్యే, కమ్మగుంటది," అన్న, బాపమ్మ మొఖంల మొఖంబెట్టి. రప్పన నీళ్లూరినయి బాపమ్మ కండ్లల్ల. వుట్టి మీద ఉన్న నూనెముంత దీసి, జరంత నూనేసింది తొక్కుల. సప్పుడు సేయకుండ గూసున్నరు ముసలోలిద్దరూ, నేను రొట్టె తిన్నంతసేపు.

కుండలకెల్లి ఇత్తడి చెంబుల నీళ్లు ముంచ్చిచ్చి, నేను సెయ్యి కడుక్కున్నంక తళ్లె దీస్కుని ఇంటెన్కకు బోయింది బాపమ్మ కడుక్కరానీకె. బుక్కెడు నీళ్ల తాగి మూతి తుడుసుకుంట పీటెమీద్కెల్లి లేసిన.

"ఆరి! రామకిష్టా!" ఇంటెన్క నుంచి పిలిచింది బాపమ్మ.

నేను బోయి నిలవడ్డ. బాపమ్మ తళ్లె కడుక్కుంట, "ఆరీ! గా పెట్టను సూడ్రా," అన్నది. నేను పెట్ట దిక్కు సూసిన.

ఆడ, నెలా నెలన్నర వయసున్న పిల్లలని, గా కోడి పెట్ట పొడిసి, పొడిసి తరుముతున్నది. గా పిల్లలు మల్ల మల్ల తల్లి తాన్కె వస్తున్నయి. అయినా ఇడ్వకుండ గా పెట్ట పిల్లలని పొడుస్తనే ఉంది.

నాకు సమజ్గాలే. గదే అడిగిన. "పిల్లలు పెద్దగయినయిరా, రామకిష్టా, దాంట్ల బతుకు అవ్వి బత్కాలె, గందుకే గా పెట్ట పిల్లలని ఎడబాపుతుంది," తళ్లెల నీళ్లు కరేపాకు చెట్టు మొదట్ల సల్లుకుంట అన్నది బాపమ్మ. "గా సంగతి నాగ్గూడ దెల్సు. ఎవ్వలి కాళ్లమీద ఆళ్లు నిలవడ్డంక, కోడిపిల్లలు దాంట్ల బతుకు అవ్వి సూసుకునే సోయి ఒచ్చినంక, పెట్ట తన పిల్లలని ఎడబాపే సంగతి నాకు తెల్సుగాదె," అన్న బాపమ్మ తోటి.

గన్మకాడ మెట్టు మీద గూసోని నన్ను దగ్గరికి పిలిసి, ఆమె తాన కూసో బెట్టుకొని చెప్పింది బాపమ్మ.

"మన తాతలనించి మనందరం మట్టి పిసుక్కుని బతికినోళ్లమే బిడ్డా. వున్నది జరంత భూమి, నీళ్లులేవు, ఉన్నంతల కాయకష్టం చేస్క బతకాలె. తిన్ననాడు తింటం, లేన్నాడు పంటం. గీ పని దప్ప ఇంగేం పని రాకపాయె. పిల్లల పెండ్లిళ్లు చేశేట్యాలకే భూమి సగమైంది. ఒక కారు పంటలాయె, జానెడు పొట్ట నిండనీకె శిన్న కష్టం గాకున్నది. అసొంటప్పుడు మీ బాపుకు సర్కారు కొలువొచ్చిందని శాన కుశాలవడ్డం. గాని గాడెప్పుడూ బూమని, దుక్కని, షెల్కని ఒకటే గున్నుడు. ఇంటికొక్కడు. ఆడన్నా సుఖంగ బతకాలని, కోడిపెట్ట పిల్లలను ఎడబాపినట్టు ఎడబాపిన బిడ్డా, నా కొడుకుని," అని ఎక్కిళ్లు వట్టింది బాపమ్మ.

నా కండ్లు గండ్లు తెగినయి. బాపమ్మ ఒళ్లె ముఖం దాపుకుని సల్లవడ్డ.

*నమస్తే తెలంగాణ ఆదివారం సంచిక బతుకమ్మ, 3 ఆగస్టు 2014*

